



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తగ్గిన సాగు...

- సాధారణ సాగులో 71 శాతమే..!
- లోటు వర్షపాతమే కారణం


ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగు ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. లోటు వర్షపాతంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు అడుగులు ముందుకు వేయలేదు. వరుసగా నష్టాలు మూటగట్టుకుంటుండటంతో విత్తనం విత్తాలా వద్దా అనే సందేహంతో సాధారణ సాగులో 71 శాతం మాత్రమే పంటలను సాగు చేశారు...

వ్యవసాయమే ప్రధానంగా ఉన్న జిల్లాల్లో కర్నూలు జిల్లా ఒకటి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో 71.80 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా 7,56,662.5 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా 4,55,577.5 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 72.65 శాతం పంట సాగైంది. వర్షం లేకపోవడం వల్ల ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. వేరుశనగ సాధారణ సాగు 1,66,407.5 ఎకరాలు కాగా 97,447.5 ఎకరాల్లో విత్తనాలు వేశారు. వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా 16,510 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కంది సాధారణ సాగు 59,822.5 ఎకరాలు కాగా 47,925 ఎకరాల్లో, ప్రొద్దుతిరుగుడు సాధారణ సాగు 1,490 ఎకరాలు కాగా 852.5 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. ఆముదం సాధారణ సాగు 20,357.5 ఎకరాలు కాగా 15517.5 ఎకరాలో సాగు చేశారు. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూట గట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. ఉల్లి సాధారణ సాగు 38,582.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 25,095 ఎకరాలు మాత్రమే సాగు చేశారు.

సాగు శాతాల్లో...

పంట	సాగైన శాతం
వరి	51.16
మొక్కజొన్న	86.10
కొర్ర	76.69
కంది	80.11
వేరుశనగ	58.56
ప్రొద్దుతిరుగుడు	57.21
ఆముదం	76.22
పత్తి	72.65
ఉల్లి	64.83
టమోటా	40.99
ఇతరములు	50.55
మొత్తం	**71.80**



విత్తనాలు వేస్తున్న రైతులు (ఫైల్)

చిరు ధాన్యాలపైనా ప్రభావం

లోటు వర్షపాతం ప్రభావం చిరు ధాన్యాల సాగు పైనా పడింది. మొక్కజొన్న సాధారణ సాగు 10,810 ఎకరాలు కాగా 9,307.5 ఎకరాల్లో సాగు చేశారు. కొర్ర సాధారణ సాగు 4,080 ఎకరాలు కాగా 3225 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం అవసరమైన రీతిలో పడకపోవడమే సాగు ముందుకు సాగకుండా పోవడానికి కారణమని పలువురు చెబుతున్నారు.

నాడు - నేడు పనులు వేగవంతం

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నాడు-నేడుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నాడు-నేడుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 5 టాయిలెట్ల నిర్మాణాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన నాలుగు కిచెన్ షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. అలాగే అదనపు తరగతి నిర్మాణాల పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వేకు సంబంధించి కరెక్షన్స్ తహశీల్దార్, ఆర్‌డిఒ స్థాయిలో సమగ్రంగా పరిశీలించి జెసి లాగిన్‌కు పంపాలని ఆదేశించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు సంబంధించి ఏ ప్రదేశంలో ఎంత సమయానికి, ఏ తేదీలో క్యాంప్ నిర్వహిస్తున్నారనే విషయం ప్రజలకు తెలియజేసే విధంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడారు. మూడు డివిజన్లలో కచ్చితంగా డేటా ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. డేటా ప్రాసెసింగ్ సెంటర్‌లో ఉన్న టీమ్ ఏ విధంగా పని చేస్తున్నారని, రీ సర్వే డిటి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్ తనిఖీ చేయాలని సూచించారు. అందుకనుగుణంగా ఆర్‌డిఒలు కూడా మానిటరింగ్ చేయాలని ఆర్‌డిఒను ఆదేశించారు.

జగనన్న కాలనీ లేఅవుట్ పరిశీలన

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన జగనన్న కాలనీలను వర్చువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో ఓర్వకల్లు జగనన్న కాలనీని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డితో కలిసి కలెక్టర్ సృజన పరిశీలించారు. ఇంటింటికీ విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే సోక్ పిట్‌లను నిర్మించాలని సూచించారు. ఆర్చికి రంగులు వేయాలని, కాలనీని అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. హౌసింగ్ పీడీ సిద్ధ లింగమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగరాజు, ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ఓర్వకల్ ఎంపిడిఒ శివనాగ ప్రసాద్, ఓర్వకల్లు తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డి, జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్, వార్డు మెంబర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ఇంటింటికీ సిపిఎం పేరుతో ప్రజల వద్దకెళ్లి చైతన్య పరుస్తామని తెలిపారు. గురువారం కల్లూరు సూర్య నారాయణ భవన్‌లో సిహెచ్.సాయిబాబా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, నిర్మల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. సర్వీస్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ట్రూ అఫ్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.వేల కోట్ల భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న భారాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ భారాలకు వ్యతిరేకంగా, బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. ప్రజలు పోరాటాల వైపు వచ్చే విధంగా కార్యకర్తలు ఈనెల 5 నుంచి 15 వరకు 'ఇంటింటికి సిపిఎం' పేరుతో ప్రజల వద్దకు వెళ్లాలని కోరారు. ప్రతి కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ... మున్సిపల్ అధికారులకు పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ చెత్తను తొలగించడంలో లేదని విమర్శించారు. చెత్త పన్ను వసూలు చేయడం తప్ప నగరంలో ఎక్కడ చూసినా చెత్తనే దర్శనం ఇస్తుందని తెలిపారు. చెత్తను సేకరించే క్లాప్ డ్రైవర్ల సమస్య పరిష్కారం చేయకుండా వారిని తొలగించడం వల్ల ఎక్కడి చెత్త అక్కడే ఉందని చెప్పారు. వెంటనే క్లాప్ డ్రైవర్లను పనిలోకి తీసుకొని చెత్తను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, ఎస్‌ఎమ్‌డి.రఫీ, జి.ఏసు, రామకృష్ణ, శంకర్, మనోహర్, ఆనంద్, ఉస్మాన్, జె.శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల

రబీకి నీళ్లివ్వలేం..!

- హెచ్‌ఎల్‌సికి నవంబర్ 10 వరకు
- ఎల్‌ఎల్‌సికి నవంబర్ 30 వరకే
- బోర్డు అధికారుల స్పష్టీకరణ

ప్రజాశక్తి - హోళగుంద

రబీకి నీళ్లివ్వలేమని తుంగభద్ర బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్‌లో 55 టిఎంసిల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో రోజుకు 2 వేల నుంచి 3 వేల క్యూసెక్కుల వస్తోంది. వచ్చిన నీరు కూడా ఆవిరి రూపంలో కరిగిపోతుండడంతో హెచ్ఎల్‌సి కాలువకు నవంబర్ 10 వరకు, ఎల్ఎల్‌సి కాలువకు నవంబర్ 30 వరకు సాగు, తాగునీరు ఇవ్వనున్నట్లు, రబీ సీజన్‌కు నీళ్లే ఉండవని గురువారం జరిగిన సమీక్షలో బోర్డు అధికారులు స్పష్టం చేశారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రంలో కర్నూలు, అనంతపురం వరకు తుంగభద్ర బోర్డు ద్వారా నీళ్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిల్వ ఉన్న నీటిలో విడుదల చేసి మిగిలిన నీటిని ముందు జాగ్రత్త చర్యగా స్టోరేజ్ చేయనున్నట్లు సమాచారం. పదేళ్లు గా ఇలాంటి పరిస్థితి తాము ఎప్పుడూ చూడలేదని అధికారుల ఆందోళన వ్యక్తం చేశారు. అక్టోబర్, నవంబర్ నెలలో మంచి వర్షాలు కురిసి తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో బాగా పెరిగితే భవిష్యత్ కార్యాచరణ తదుపరి సమావేశంలో నిర్వహిస్తామని తెలిపారు.

వరి పంట చేతికందడం ప్రశ్నార్థకం

ఎల్ఎల్‌సి కాలువకు నవంబర్ 30 వరకు నీటిని విడుదల చేస్తామని, తర్వాత నీటి లభ్యతను బట్టి నిర్ణయం తీసుకుంటున్నట్లు బోర్డు అధికారులు పేర్కొనడంతో ఖరీఫ్‌లో వరి పంట చేతికందడం ప్రశ్నార్థకంగా మారిందని అన్నదాతల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశామని వాపోయారు. ఇంకో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేయకపోతే పంట చేతికి రాదని పేర్కొంటున్నారు. తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వ పూర్తిగా పడిపోవడంతో పెట్టిన పెట్టుబడి సైతం వస్తుందా లేదా అని రైతులు దిగులు చెందుతున్నారు.



సమావేశం నిర్వహిస్తున్న బోర్డు అధికారులు

ప్రశ్నాపత్రాల ముద్రణకు దిక్కేది..?

- ఉపాధ్యాయుల వాట్సప్‌కు ప్రశ్నాపత్రాలు - విద్యాశాఖ తీరుపై ఆగ్రహం
- పేపర్ లీకేజీ కాకుండా చర్యలు - డిఇఒ డాక్టర్ వెంకట రంగారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్య నిర్వహణకు పెట్టే పరీక్షలకు ప్రశ్నాపత్రాల ముద్రణకు నిధులు లేని పరిస్థితి ఉంది. విద్యాశాఖ ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ వాట్సప్‌కు విద్యాశాఖ అధికారులు పంపుతూ పరీక్షలను నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 1370 పాఠశాలలు ఉండగా 2,57,740 మంది విద్యార్థులు ఫార్మాటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు రాశారు. ఈ పరీక్షల ప్రశ్నాపత్రాలను పాఠశాల ఉపాధ్యాయుల వాట్సప్ మొబైల్ నెంబర్లకు నేరుగా పంపుతున్నారు. ఉపాధ్యాయులు వాట్సప్‌లో వచ్చిన ప్రశ్నలను బోర్డుపై రాసి విద్యార్థులకు పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఎస్‌సిఈఆర్‌టి నేరుగా ప్రశ్నాపత్రాలను తయారు చేసి పంపుతున్నారు. గత మూడు రోజులుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల నిర్వహణకు 45 నిమిషాలు మాత్రమే సమయం ఇచ్చారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రం రాసుకునేందుకు మరో అరగంట సమయాన్ని ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు ఈ పరీక్షలు రాసేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో మొబైల్ సెల్ టవర్ సిగ్నల్స్ అందక ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలను సకాలంలో అందుకోలేక ఇబ్బందికి గురయ్యారు. ఉదయం 8, 9, 10వ తరగతి తరగతులకు పరీక్షలు నిర్వహించగా, మధ్యాహ్నం 5, 6, 7వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా అన్ని పరీక్షలను నిర్వహిస్తారు. ఇక్కడి నుంచే ప్రశ్నాపత్రాలను ముద్రించి పాఠశాలలకు పంపుతారు. ఈసారి విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందించక వాట్సప్ ద్వారా ప్రశ్నాపత్రాలను పంపడంపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే నెలలో జరిగే సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు తప్పనిసరిగా ప్రశ్నాపత్రాలను ముద్రించి ఇస్తే తప్ప పరీక్షలు నిర్వహించలేమని ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. అన్ని రకాల పరీక్షల ప్రశ్నాపత్రాలను నేరుగా ముద్రించి పాఠశాలలకు పంపాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పేపర్ లీకేజీ కాకుండా చర్యలు
- డిఇఒ డాక్టర్ వెంకట రంగారెడ్డి

ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన పేపర్ లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నాం. అందుకే ఉపాధ్యాయుల మొబైల్ నెంబర్ వాట్సప్‌కు నేరుగా ప్రశ్నాపత్రాలను పంపాం. ప్రశ్నాపత్రాలు రాసుకునేందుకు విద్యార్థులకు అదనంగా సమయం కేటాయించాం.



ఉపాధ్యాయునిలను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు నగరంలోని మాధవి నగర్, రెవెన్యూ కాలనీలలో ఉన్న రవీంద్ర ఇంగ్లీషు మీడియం, టాలెంట్ స్కూల్స్‌లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం కరస్పాండెంట్ పిబివి. సుబ్బయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునెస్కో వారు సర్వేలో అధ్యాపకుడు, తరగతి గది మాత్రమే విద్య, విజ్ఞానం, విలువలు అందజేస్తారని తెలిపారు. వారి ప్రకారం అక్టోబర్ 5న ప్రపంచ అద్యాపక దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల విద్య మాత్రమే విలువలు అందజేయు కర్మాగారమన్నారు. అనంరంఉత్తమ ఉపాధ్యాయులు శారద దేవి, నాగేంద్ర, సుభద్ర, అక్తర్ భేగం, విజయ్ కుమార్, సౌజన్యలను ఘనంగా సన్మానించారు.

ముడుమాలలో పేరుకుపోయిన అపరిశుభ్రత

- ఇప్పటికే డెంగీతో ఒకరు మృతి - 40 మంది అస్పత్రిలో..
- కలెక్టరమ్మ గ్రామాన్ని సందర్శించాలి : గ్రామస్తులు

ప్రజాశక్తి - సి బెళగల్ : మండలంలోని ముడుమాల గ్రామంలో అపరిశుభ్రత విలయతాండవం చేస్తుంది. పరిశుభ్రత లోపించడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే డెంగీ వ్యాధితో మహిళ మృతి చెందింది. మరో 40 మంది అస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామం మొత్తం అనారోగ్యం బారిన పడినా వైద్యుల సేవలు మాత్రం నామమాత్రమే. కలెక్టరమ్మ ఒక్కసారి తమ గ్రామాన్ని సందర్శించాలని గ్రామస్తులు మొరపెట్టుకొంటున్నారు. గ్రామంలో ట్యాంకులు, రోడ్లు శుభ్రం చేయడం లేదు. మురుగు ఉన్న చోట కనీసం బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లించడం లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. పందుల సంచారం అధికమయింది. ఫలంగా డెంగీ వ్యాధి విస్తరించడంతో ఓ మహిళ మృతి చెందింది. 40 మంది కర్నూల్ ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొంతమంది వ్యయప్రయాసాలు కోర్చక గ్రామంలోనే ప్రైవేట్ అస్పత్రులను ఆశ్రస్తున్నారు. వైద్యులు నామమాత్రంగా చర్యలు చేపట్టడంతో గ్రామంలో తీవ్రస్థాయిలో డెంగీ బాధితుల సంఖ్య పెరిగింది. కలెక్టర్ గారు నేరుగా సందర్శించి గ్రామాన్ని పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పేరుకుపోయిన మురుగు

ఆటో డ్రైవర్లందరికీ ఉచితంగా కంటి పరీక్షలు

-ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ జయప్రకాష్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఆటో డ్రైవర్ల అందరికీ ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేస్తామని ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ జయప్రకాష్ అన్నారు. గురువారం కర్నూల్ నగర పరిధిలోని సుందరయ్య సర్కిల్‌లో సుందరయ్య ఆటో స్టాండ్ ఏర్పడి ఐదు సంవత్సరాలు అయిన సందర్భంగా ఆటో స్టాండ్ కమిటీ ఆధ్వర్యంలో 5వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆటో స్టాండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆటో స్టాండ్ అధ్యక్షులు కరుణాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్. జయప్రకాష్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, న్యూ సిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రైవర్లు ఏర్పాటు చేసిన కేకును అతిథులు కట్ చేశారు. అనంతరం డాక్టర్ జయప్రకాష్, పి.నిర్మల మాట్లాడారు. ఆటో కార్మికులు వారి కుటుంబ పోషణ కోసం రాత్రింబవళ్లు ఆటోలు నడుపుతూ కష్టపడుతుంటారని, రాత్రి వేళల్లో ఆటోలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ముఖ్యంగా ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గతంలో చాలామంది డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అనేకమందికి ఆపరేషన్ చేయించానని, మరొకసారి ఆటో డ్రైవర్ల అందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటామన్నారు. సుందరయ్య స్టాండ్ ఏర్పడ్డాక ప్రజలు, అక్కడ ఉన్న షాప్ యజమానులందరికీ ఉపయోగపడేలా ఆటో డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. రానున్న కాలంలో ఆటో స్టాండ్ ఇంకా బలోపేతం చేసి కార్యకర్తలను పెంచుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రజలతో సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. అనంతరం కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ మాట్లాడారు. ఆటో స్టాండ్ జెండాను స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు చిన్న, కరుణాకర్, పెద్ద కరుణాకర్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నగర అధ్యక్షులు భాస్కర్, ఆటో యూనియన్ అధ్యక్షులు ఎస్. హుస్సేన్ వలి, ఉపాధ్యక్షులు. మళ్లీ, సుందరయ్య ఆటో స్టాండ్ నాయకులు జహంగీర్, మియా భాష, నాగరాజు, మాభాష, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పి.నిర్మల, డాక్టర్ జయ ప్రకాష్

7న పశు పోషకులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూల్ నుండి పెద్దపాడు వెళ్లే రహదారిలో ఉన్న పుష్ప రాజ్ ఫంక్షన్ హాల్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7న పశు పోషకులకు జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నరు. ఈ అవగాహన సదస్సును రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఒక్కొక్క సదస్సుకు 400 మంది ఔత్సాహిక పశుపోషకులతో నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్ అమరేంద్ర కుమార్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, కర్నూలు జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ అధ్యక్షులు వై.నాగేశ్వర రావు యాదవ్, జిల్లా పశుగణాభివద్ధి సంస్థ అధ్యక్షులు ఎస్‌వి జగన్మోహన్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య పాల్గొంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా వివిధ రకాల కోళ్ల పెంపకం యూనిట్లకు, గొర్రెల పెంపకం యూనిట్లకు, పందుల పెంపకం యూనిట్లకు వివిధ స్థాయిలలో 50 శాతం సబ్సిడీతో యూనిట్ల స్థాపనకు ఔత్సాహిక పశు పోషకులు ఆన్లైన్లో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, రైతు భరోసా కేంద్రాల సలహా మండలి సభ్యులు, ప్రాథమిక గొర్రెల మేకల పెంపకం దారుల సంఘాల అధ్యక్షులు, ఔత్సాహిక పశుపోషకులు హాజరు కావాలని కోరారు.

అన్ని పార్టీలూ సహకరించాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

లోపాల్లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాను ప్రక్షాళన చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు ఉండగా 24 కేంద్రాల్లో సదుపాయాలు సరిగా లేవని తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. 24 కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదన సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కేంద్రాల మార్పునకు ఏవైనా సూచనలుంటే తెలియజేయవచ్చని, వాటిని ఈఆర్‌ఓలు పరిశీలించి తగిన నివేదికలు ఇస్తారని సూచించారు. పోలింగ్ కేంద్రాలు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భవనాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో ర్యాంప్, టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్, కరెంట్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిపిఎం లింగన్న, వైసిపి ప్రసాదరావు, టిడిపి మల్లికార్జున, జగదీష్, కాంగ్రెస్ దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠప్ప, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కర్నూలు ఎమ్మెల్యే ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నుంచి వినతి పత్రాలను ఆయన స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



కార్యక్రమంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

కోతిరాళ్లలో జగనన్న సురక్ష క్యాంప్ వెలవెల

- సభా వేదికపై, ముందు ఖాళీగా కుర్చీలు

ప్రజాశక్తి - పత్తికొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం పత్తికొండ మండలం కోతిరాళ్ల గ్రామంలో వెలవెలబోయింది. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు. ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించినప్పుడు 330 మందిని రోగులను గుర్తించారు. క్యాంపులో సగం మంది ఉపయోగించుకోలేదు. సభా వేదికపై కుర్చీలు, రోగులకు వేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందారు. మధ్యాహ్న సమయంలో సిబ్బందికి భోజనం కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. అర్బన్ ప్రాంతాలకు రూ. 60,000, రూరల్ ప్రాంతాలకు రూ.40,000 నిధులు మంజూరు చేసినట్లు తెలుస్తుంది. ఎంపీడీవో టీం, ఎమ్మార్వో టీం విడిపోయి మండలంలోని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహిస్తారు. ఇప్పటికైనా జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలపై నిర్లక్ష్యం వీడి రోగులకు అవగాహన కల్పించాలని పత్తికొండ మండల ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సందీప్ రెడ్డి, శ్యాముల్, భాస్కర్, శ్రావణి, కార్తీక్, ఈఓఆర్డి సులోచన, సుజాత, సర్పంచ్ ఆంజనేయ, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మునిస్వామి, ఎంఇఒ మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ

ప్రజాశక్తి - చిప్పగిరి : మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో 'స్వచ్ఛతే సేవ'లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. గాంధీ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలన్న, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చిన్న నాగన్న పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల నుంచి సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సచివాలయ అధికారులు దినేష్, లక్ష్మి, రాజేశ్వరి, మహిళా సంరక్షకులు పావనిపాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టే ప్రజా పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న కోరారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో గోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలపై నిరంకుశంగా వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సులు, సెమినార్లలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈనెల 16, 17, 18న ప్రచార జాతాలు, 21న ఆదోని నుంచి రాష్ట్రస్థాయి బస్సుజాతా చేపడుతున్నట్లు తెలిపారు. సిపిఎం పట్టణ నాయకులు తిప్పన్న, ముక్కన్న, వీరేష్, నాగేంద్ర, కృష్ణమూర్తి, నాగరాజు, ఖాన్, మునెప్ప పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం'

ప్రజాశక్తి - ఆదోని

పురవాసులకు రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సదుపాయాలు కల్పిస్తూ ముందుకు సాగుతున్నామని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి నాయకులు జయమనోజ్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదోనిలోని 26వ వార్డు వెంకన్నపేటలో వార్డు కౌన్సిలర్ శాంతి, ఇన్‌ఛార్జ్ మల్లికార్జునతో కలిసి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా యుద్ధ ప్రాతిపదికన ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతులకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. 2024లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, సన్నీ, శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు రఘునాథ్ రెడ్డి, ఇంతియాజ్, మంబర్తి స్వామి, చాంద్ బాషా, భాస్కర్, ఫయాజ్, గోవిందు, మలేకర్ గోవిందు, రంగస్వామి, ధనుష్, రాందాస్, పంపారెడ్డి, రైల్వే ఈరన్న, వేణు, సూరి, సురేష్, మల్లి, సుధాకర్, ఎఇ రాజశేఖర్ రెడ్డి, కృపాకర్ ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 29వ వార్డులో అభివృద్ధి పనులకు వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. గురువారం గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.24 లక్షలు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.25 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్ము రాజశేఖర్, కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ డిఇ మనోహర్ రెడ్డి, కౌన్సిలర్ డిస్ కేశవ రెడ్డి, నాయకులు గట్టు ఖాజా, రజాక్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర స్వామిని టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో నిర్మించనున్న రామ మందిరం నమూనాను శ్రీమఠం ప్రాకారంలో భక్తులు చేసిన నేపథ్యంలో సందర్శించగా, శ్రీరామ్ ఫౌండేషన్ సభ్యులు ఆలయ ప్రత్యేకతను వివరించారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ వేణుగోపాల్ రాజ్, సర్పంచి భీమయ్య, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, నాయకులు జనార్ధన్ రెడ్డి, శివకుమార్, మాజీ ఎంపిటిసి వీరేష్, సున్నం రామయ్య ఉన్నారు.

నేడు వైసిపి విస్తృత సమావేశం : వైసిపి



చిప్పగిరి : మండల కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి జూటూరు హేమలత అధ్యక్షతన వైసిపి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సలహా మేరకు 'మా నమ్మకం నువ్వే. జగన్ ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి' అంశంపై మండల కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

అధికారులపై చర్యలేవి..?

బీసీ సామాజిక వర్గానికి ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చినా...

- లబ్ధి పొందిన పథకాల్లో ఎస్సీ కులంతో చలామణి

ప్రజాశక్తి-ఆలూరు

డబ్బులిస్తే ఏమైనా మార్చగలమని ఆలూరు రెవెన్యూ అధికారులు రుజువు చేస్తున్నారు. ఆలూరు 4వ సచివాలయం పరిధిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చిన ఘనత రెవెన్యూ అధికారులది. లేని భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించేస్తున్నారు. లేట్ రిజిస్ట్రేషన్, డెత్ సర్టిఫికెట్ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేయడం, ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు ఒకరేటు, పాస్ పుస్తకాలలకు మరో రేటు అంటూ బాధితుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పుడు ఏకంగా కులాలను మారుస్తూ తప్పుడు సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారు. గత జూన్ నెలలో 'రెవెన్యూ లీలలు' శీర్షిక ప్రచురితమైనా, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు విచారించకుండా, సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తప్పు చేసిన అధికారులకు మరింత తప్పులు చేయవచ్చని సూచించనట్లుగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఎస్సీ కుల సర్టిఫికెట్ మంజూరు

మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్తతో గొడవపడి పిల్లలతో కలిసి ఆలూరులో కాపురం ఉంటున్నారు. భర్తతో గొడవ పడిన సమయంలో పోలీసు స్టేషన్‌కు తిరిగే క్రమంలో కుల సంఘానికి చెందిన నాయకునితో 'సంబంధం' ఏర్పడింది. కులసంఘం నాయకుని పలుకుబడితో ఏకంగా బీసీ సామాజిక మహిళకు ఎస్సీ సర్టిఫికెట్‌ను మంజూరు చేయించారు. గ్రామ సచివాలయంలో పని చేసే విఆర్ఒ సహకారంతో రెవెన్యూ అధికారులు మాముళ్లకు తలొగ్గడంతో ఎస్సీ సర్టిఫికెట్‌తో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డులో ఎస్సీ సామాజిక కులం పేరుతో మంజూరయినట్లు తెలిసింది. ఓ వైపు ఎస్సీ సర్టిఫికెట్ పొందిన మహిళ గతేడాది వైఎస్ఆర్ చేయూత, ఒంటరి మహిళ పింఛనులో ఎస్సీ కులం పేరుతో, ఇళ్ల మంజూరులో మాత్రం బీసీ పేరుతో ఇలా వివిధ పథకాల్లో వేర్వేరుగా ఉండడం చూస్తే అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది.


ఆలూరు తహశీల్దార్ కార్యాలయం

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- వైసిపి రాష్ట్ర యువజన నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి కోరారు. గురువారం మండలంలోని హాల్వి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వ పథకాల కోసం అధికారులు, నాయకులు, ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగినా అందేవి కాదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, సర్పంచి క్రాంతి, వైసిపి నాయకులు చెన్నప్ప, ఏకం రెడ్డి, బసవ ప్రభు, సిద్ధన్న గౌడ్, దర్గా సాధిక్, కొండప్ప, మరి గౌడ్, బసప్ప గౌడ్ పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి

దీర్ఘకాలిక సమస్య పరిష్కారం

- డ్రెయినేజీ, సిసి రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రూ.35 లక్షల వ్యయంతో డ్రెయినేజీ, సిసి రోడ్డు నిర్మాణ పనులకు సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా రోడ్డు సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పనులను 3 నెలల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... వర్షం పడితే కార్యాలయ ఆవరణలో ప్రజలకు ఇబ్బందిగా ఉండేదని, మున్సిపల్, సబ్ కలెక్టర్ సహకారంతో సిసి రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ, డిప్యూటీ ఇంజినీర్లు వెంకట చలపతి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప ఉన్నారు.


రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్

నియంత పాలనకు కేరాఫ్ మోడీ

- ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

- అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

దేశంలో నరేంద్ర మోడీ నియంత పాలన కొనసాగిస్తున్నారని ఎపిడబ్ల్యుజెఎఫ్, అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు పేర్కొన్నారు. పత్రికలపై దాడులు చేయడమంటే ప్రజల గొంతును నొక్కడమేనని, ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, నియంత పాలనకు కేరాఫ్ అడ్రస్ నరేంద్ర మోడీ అని, కేంద్రం అమలు చేస్తున్న విధానాలు, స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తుందని తెలిపారు. గురువారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ధర్నా చేపట్టారు. నగర ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శి రాజశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు మునెప్ప, కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శి శేఖర్, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు శేషఫణి, ఆర్‌టిఐ జిల్లా నాయకులు జమ్మన్న, ఏపిడబ్ల్యుజెఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సీనియర్ నాయకులు పానుగంటి చంద్రయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న రిటైర్డ్ తహశీల్దార్ రోషన్ అలీలు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు మర్చిపోయి వారి మీదనే కేసులు, దాడులు చేయించి, దేశద్రోహులకంటే అధ్వానంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రామాంజనేయులు, ఏపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు యూసుఫ్ ఖాన్, చంద్రమోహన్, చెన్నయ్య, నగర నాయకులు మౌలాలి, మహేష్, అసిఫ్, మాలిక్, కిషోర్, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పిటల్ :** న్యూఢిల్లీ న్యూస్ క్లిక్ సంస్థపై కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఎ ద్వారా జరిపిన దాడులు హేయమైన చర్య అని నేషనల్ అలియన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె) జాతీయ కౌన్సిల్ సభ్యులు, జర్నలిస్ట్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) ఉమ్మడి జిల్లా కన్వీనర్ టిజి ప్రసాద్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు చంద్రయ్యలు విమర్శించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఏల ఆధ్వర్యంలో కల్లూరు మండల కమిటీ అధ్యక్షులు పీజీ వెంకటేష్ అధ్యక్షతన జర్నలిస్టులు చేతులకి నల్లరిబ్బన్ సంకెళ్ళతో వినూత్నరీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాణ్యం కార్యదర్శి నీలం సత్య నారాయణ, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు నాగేంద్ర, ఈసి సభ్యులు షేక్ సలీం మాలిక్, మండల సభ్యులు జనార్దన్, గంగాధర్, శేఖర్, దేవరాజ్, వెంకటేష్, మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఉచితంగా వైద్యమందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచితంగా వైద్య సేవలందించడమే లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని హనుమాపురం గ్రామంలో సర్పంచి పూజారి ఇందిర ఈరన్న ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **చిప్పగిరి** మండలం రామదుర్గం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సర్పంచి రోహిణి, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ సివి.కొండయ్య, ప్రభుత్వ వైద్యాధికారి జమీల్ అహ్మద్ హాజరయ్యారు. కర్నూలు నుంచి వచ్చిన జనరల్ సర్జన్ సాయి హితేష్, మమత, ఆలూరు శేఖర్, జమీల్ అహ్మద్ పరీక్షలు నిర్వహించారు. ఐసిడిఎస్ శాఖ సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో పౌష్టికాహారానికి సంబంధించిన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వైసిపి నాయకులు ఈరప్ప, ఫార్మాసిస్ట్ కృష్ణ, అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, శంకరమ్మ, జయమ్మ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం ములుగుందం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను డాక్టర్ రఘురాం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచి శ్యామలమ్మ, డాక్టర్ బాలకృష్ణా రెడ్డి, సైకాలజిస్ట్ కల్పన, బాల సిద్ధార్థ, అంగన్వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు జంప్లా నాయక్, శ్రీలక్ష్మి, ఎఎన్ఎంలు రాధా, పద్మ పాల్గొన్నారు.


పెద్దకడబూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ.పి నెంబర్ 14/2023

కె.కిరణ్మయి. ...అర్జీదారురాలు

(ఎదురు)

పోతుల సుబ్రమన్యం వగైరా. ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు ఐ.పిలో అర్జీదారురాలు అయిన కె.కిరణ్మయి భర్త కె.మధు ఇంటి నెంబర్ 6/96, పోలీస్ కాలనీ బి.తాండ్రపాడు, కర్నూలు జిల్లా అను తనను దివాళాదారురాలుగా తీర్మానించమని కోరుతూ పైకోర్టులో దివాళా అర్జీ దాఖలు చేసినది. ఇందులో ఎవరికైనా ఆక్షేపణ ఉన్నా 06-10-2023వ తేదీ పగలు 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఎస్. అహ్మద్ భాషా,
అర్జీదారు పరం అడ్వకేట్, కర్నూలు.

యాప్‌ను రద్దు చేయాలి

- సిఐటియు నాయకులు రాముడు

ప్రజాశక్తి - మంత్రాలయం

అంగన్వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని సిఐటియు నాయకులు రాముడు కోరారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం మంత్రాలయంలో సమగ్ర శిశు అభివృద్ధి (సిడిపిఒ) కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాముడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు లూసమ్మ, పద్మ, వరలక్ష్మి మాట్లాడారు. ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. గతంలో లాగా వారికి సరుకులు అందజేసి సంతకాలు తీసుకునే విధంగా అవకాశం కల్పించాలని తెలిపారు. అనంతరం సిడిపిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ షేక్షావలీకి వినతిపత్రం అందజేశారు. భీమలింగమ్మ, మద్దమ్మ, జ్యోతి, కళ్యాణి, విజయమ్మ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ

ప్రజాశక్తి - కౌతాళం



బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కౌతాళం గ్రామానికి చెందిన రామకృష్ణను నియమించారు. గురువారం ఆయన మాట్లాడారు. బిజెపి జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

కోర్టులను తప్పదోవ పట్టించే ప్రయత్నంలో వైసిపి

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి వైసిపి ప్రభుత్వం కోర్టులను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. గురువారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రాఘవేంద్ర సర్కిల్‌లో సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు పంటలు నష్టపోయారని తెలిపారు. వారి నష్టపరిహారం ఇవ్వడమా లేక కేంద్ర నిధుల ద్వారా సహాయం చేయడమా అనే అంశాన్ని విస్మరించి రాష్ట్ర ప్రజలను పక్కదారి పట్టించేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రతి గడపకూ తెలిపి, రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కౌతాళం మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ వెంకటపతి రాజు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు దీక్షల్లో కూర్చున్నారు. టిడిపి తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయన, నాయకులు అశోక్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, అడివప్ప గౌడ్, చెన్నబసప్ప ధని, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మారెప్ప, జ్ఞానేష్, నాగేష్, యోబు, అబ్దుల్, వట్టేప్ప గారి నరసింహ, ఇతర నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపి నిమ్మరసమిచ్చి దీక్షను విరమింపజేశారు. **ఆదోని** ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద 'బాబు కోసం మేము సైతం' అంటూ టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో రోడ్డుపై ఈత చెట్టు కొమ్మలు, కల్లుముంతలతో నిరసన చేపట్టారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమా పతి నాయుడు, నాయకులు రామస్వామి, లక్ష్మీనారాయణ, శివప్ప, మాజీ కౌన్సిలర్లు బాలాజీ, నరసింహులు, బ్రహ్మ, వీరేష్, మల్లికార్జున, రంగన్న, జగదీష్, కృష్ణారెడ్డి, లింగన్న గౌడ్ ఉన్నారు. అలాగే ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో ఈడిగ గౌడ కులస్తులు జాలమంచి రామాంజనేయులు, జాలమంచి శరణప్ప, జాలమంచి ఆంజనేయులు, మాంత్రికి గిడ్డయ్య, మాంత్రికి రామరాజు, మాంత్రికి, పెద్ద గిడ్డయ్య, మాంత్రికి నాగేంద్ర, దొడ్డనగేరి వెంకటేష్, వందగల్లు వెంకటేష్, ఆదోని రవి, విరుపాపురం ఈడిగె ఆంజనేయ, పెద్దహరివాణం లింగన్న సంఘిభావంగా దీక్షలు కూర్చున్నారు. నాయకులు రాముడు, విరుపాక్షి, మాజీ ఎంపిపి జయ కుమార్, వల్లమన్న, రాఘవేంద్ర, బసవరాజు, సుధాకర్, నాగరాజు, ప్రహ్లాద రెడ్డి, గోపాల్, సాధుల్లా, కృష్ణారెడ్డి, మహేంద్ర ఉన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలోని పెద్దతుంబలం 6వ వార్డులో సంతకాల సేకరణ చేపడుతూ పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, మాజీ ఎంపిపి మురళీ, గిరిధర్, పెద్దతుంబలం కొండాపురం శ్రీనివాస్, నరసింహులు, నరసప్ప, ఈరన్న, రెడ్డి, బాబురావు, నాగేంద్ర, లక్ష్మీకాంతరెడ్డి, బాలరాజు, భరత్ కుమార్, వీరేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సోమప్ప సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 23వ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. టిడిపి నందవరం మండలం హాలహర్వి నాయకులు ఎన్.నారాయణ రెడ్డి, ఎం.దావీదు, జి.గోపాల్, నాగరాజు, గోవిందు, దాస్, ప్రేమ్, మణి, ముక్కరన్న, సుబ్బన్న, కిస్టఫర్, రవి, సురేష్, ఎర్రం నాయుడు, బాపురం వెంకట రాముడు, రామాంజనేయులు, జగ్గాపురం రంగన్న, గోపాల్, నరసింహులు, దర్మపురం స్వామి దీక్షలో కూర్చున్నారు. దీక్షలను బీవీ ప్రారంభించారు. టిడిపి నాయకులు సుందర్ రాజు, కొండయ్య చౌదరి, మిఠాయి నరసింహులు, రామదాసు గౌడ్, గురురాజ్ రావు దేశాయి, దయాసాగర్, కలీముల్లా, రామకృష్ణ నాయుడు, సోగనూరు డి.దస్తగిరి, మల్లికార్జున, కటారి రాజేంద్ర, ధామ నరసింహులు, బోయ రంగన్న, దాదా వలీ, నజీర్ అహ్మద్, శిల్పి భాస్కర్, డీలర్ ఈరన్న, ఎరుకల పరమేష్, ఎరుకల శ్రీనివాసులు, వడ్డే కృష్ణ, మసీదుపురం రఘు పాల్గొన్నారు.


మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి


ఆదోనిలో కల్లు ముంతలతో నిరసన తెలుపుతున్న నాయకులు


ఎమ్మిగనూరులో దీక్షల్లో కూర్చున్న బీవీ

IN THE COURT OF THE HONBLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ADONI
O.S No. 271/2022

Between:
J.Mahalingaiah Swamy. ...Plaintiff
AND
V.Balaraju. ...Defendants

NOTICE

To:
Vadde Balaraju S/o Late V Hanumanthappa, aged about 45 Years, Residing of Nadhichagi Village, Kowthalam Mandalam, Kurnool Dist, Andhra Pradesh - 518 333.

Whereas the above named plaintiff has filed above suit against you. This Hon'ble Court was pleased permit the plaintiff to serve summons to defendant by way of paper publication. Therefore you are hereby directed to appear before this Hon'ble Court on 10/10/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections, failing which the matter will be decided in your absence.

L.K Jeevan Singh,
B.E.,LL.B
Advocate for Plaintiff

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR:: KURNOOL
(Application for reference of Dispute to Arbitration)
DISPUTE NO. ARC/KNL/ 61 / 2023

Between :-
M/S.Chalapathi Chit Fund (P) Ltd., Kurnool, Rep. by its Manager/Foreman. ...Disputant
V/S
Mr.V.Srinivas Achari and Others. ...Opponents

Opponents 1 To 5 Notices

Opponent No.1. Mr.Vadla Srinivas Achari S/o.V.Venkat Swami, Hindu, aged 37 Years, H.No. 11-71, Near I.T.C, Krishna Nagar, Kurnool.

Opponent No.2. Mr.Kammari Nadipi Brahmiah S/o.K.P.Sarabaiah, Hindu, aged 66 Years, H.No.76-97-439-55-7A, L.Venkaiah Nagar, Bellary Road, Kurnool.

Opponent No.3. Mr.Sabbi Reddy Mallikarjuna Reddy S/o.S.Sanjeeva Reddy, Hindu, aged 40 Years, H.No. 51/952 - 5 - 92B, .P.V.Narasimha Rao Nagar, Kurnool.

Opponent No.4. Mr.Vadla Veerachari S/o.V.Bhagavantachari, Hindu, aged 35 Years, H.No.76/97-319, B.C.Colony, N.T.R.Nagar, Near Ramula Temple, Kurnool.

Opponent No.5. Mrs.Vadla Usha Rani W/o..V.Srinivas Achari, Hindu, aged 28 Years, H.No.11-71, Near I.T.C, Krishna Nagar, Kurnool.

డిస్ప్యూట్, భాకీ మొత్తము రూ.2,18,800-00 రాబట్టు కొనుటకు గాను మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 నుండి 5 అపోనెంట్స్ అయిన మీరు 27-10-2023 వ తేది రోజున ఉదయం 11-00 గంటలకు మీరు కాని మీ తరపున న్యాయవాది కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్, దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించుబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

Hearing Date : - 27-10-2023

(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS)
BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBTRATION, KURNOOL.

మర్చిపోయిన బ్యాగు అందజేత

- నిజాయితీగా డిపోలో అప్పజెప్పిన డ్రైవర్ వాసు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బస్సులో మర్చిపోయిన బ్యాగును ప్రయాణికునికి అప్పజెప్పారు. బుధవారం 5 గంటల బళ్లారి సర్వీసు చేస్తుండగా సి.బెళగల్‌కు చెందిన కె.రామాంజనేయులు బ్యాగును బస్సులోనే మర్చిపోయారు. బస్సు దిగిన తర్వాత చూసుకుంటే తన బ్యాగు కనపడలేదు. వెంటనే ఆర్‌టిసి డిపో మేనేజర్ బి.అమర్‌నాథ్‌కు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో బ్యాగును కెఎస్.వాసు తీసుకొని డిపో క్లర్క్‌కు అందజేశారు. అందులో రూ.32 వేల నగదు, బ్యాంకు కార్డు, ఇతర వస్తువులు ఉన్నాయి. గురువారం డిపో మేనేజర్ చేతులమీదుగా పంపాపతి, సూపరింటెండెంట్ కుమార్, డిపో అకౌంటెంట్ నాగరాజు, డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు సమక్షంలో రామాంజనేయులుకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌కు, డ్రైవర్ వాసుకు రామాంజనేయులు కతజ్ఞతలు తెలిపారు. డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పంపయ్య ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసినట్లు నాయకులు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో 'జాతీయ సమైక్యత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. గురువారం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, పట్టణ నాయకులు అజిత్ ఆధ్వర్యంలో విజేతలుగా నిలిచిన గవర్నమెంట్ జూనియర్ కళాశాల, వైష్ణవి జూనియర్ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కె.అక్షయ, రెండో బహుమతిగా జి.వర్షిని, మూడో బహుమతి డి.శిరీషకు గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయ రాణి, లెక్చరర్లు రవి ప్రభాస్, నగేష్ బహుమతులు అందజేశారు. వైష్ణవి కళాశాలలో ఛైర్మన్ గడిగే లింగప్ప, ప్రిన్సిపల్ మునెప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు కళాశాల ఛాంబర్‌లో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సి.వాసవి, రెండో బహుమతి బి.రాజేశ్వరి, మూడో బహుమతిగా జి.పరశురాంకు అందజేశారు.


జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర ప్రభుత్వ నిఘా సంస్థలు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ మీడియాపై దాడులకు తెగబడడాన్ని ఖండిస్తున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బసప్ప, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న పేర్కొన్నారు. గురువారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యూఢిల్లీలో ఈనెల 3న 46 మంది జర్నలిస్టులు, రచయితలు, కవులు, కళాకారులపై దాడులు చేసి అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మునెప్ప, ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, విజయ్, కోశాధికారి సుధాకర్, నాయకులు మల్లికార్జున, షంషీర్ ఖాన్, రమేష్ రెడ్డి, సుధాకర్, మురళీ, పురుషోత్తం, చంద్ర, రంజాన్ ఉన్నారు. **ఎమ్మిగనూరు**లో ఎపిడబ్ల్యుజెఎఫ్, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కళ్లకు నల్ల గంతలు కట్టుకొని ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఫెడరేషన్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్, గౌరవాధ్యక్షులు దేవేంద్ర మూర్తి, చంద్రశేఖర్, సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం మండల నాయకులు భాస్కర్ యాదవ్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి హనీఫ్, ఫెడరేషన్ నాయకులు నరసింహులు, సొహైల్, ఖలీల్, రంగయ్య, వీరేష్, హనుమంతరావు, ఇబ్రహీం, ఇలియాస్, మురళీ పాల్గొన్నారు.


ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు





జివి మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

సగమే సాగు



- సాధారణ సాగులో 56 శాతమే పంటలు - లోటు వర్షపాతమే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో సాగు ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. లోటు వర్షపాతంతో విత్తనాలు వేసేందుకు అన్నదాతలు అడుగులు ముందుకు వేయలేదు. వరుసగా నష్టాలు మూటగట్టుకుంటుండటంతో విత్తనం విత్తాలా వద్దా అనే సందేహంతో సాధారణ సాగులో 56 శాతమే పంటలను సాగు చేశారు...

వ్యవసాయమే ప్రధానంగా ఉన్న జిల్లాల్లో నంద్యాల జిల్లా ఒకటి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ సాధారణ సాగులో కేవలం 56 శాతం మాత్రమే విత్తనాలు వేశారు. జిల్లాలో మొత్తం సాధారణ సాగు 5,93,482.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 3,36,165 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు ఆశించిన రీతిలో పడకపోవడంతో విత్తనం విత్తేందుకు రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా కేవలం 45,062.5 ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకూ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 1,04,745 ఎకరాలు కాగా 86,125 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. కంది సాధారణ సాగు 93,877.5 ఎకరాలు కాగా 73,680 ఎకరాల్లో, మినుము సాధారణ సాగు 16,982.5 ఎకరాలు కాగా 12,387.5 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు 39,510 ఎకరాలు కాగా 21,050 ఎకరాల్లో సాగైంది. జిల్లా వ్యాప్తంగా పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 63,965 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 23,387.5 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఉల్లి సాధారణ సాగు 10,182.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 4,997.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో మిరప సాధారణ సాగు విస్తీర్ణం 25,010 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ కేవలం 13,050 ఎకరాల్లో సాగైంది. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పసుపు సాధారణ సాగు 2,737.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 435 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

చిరు ధాన్యాలపైనా ప్రభావం

లోటు వర్షపాతం ప్రభావం చిరు ధాన్యాల సాగు పైనా పడింది. కొర్ర సాధారణ సాగు 4,860 ఎకరాలు కాగా కేవలం 2,895 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం అవసరమైన రీతిలో పడకపోవడమే సాగు ముందుకు సాగకుండా పోవడానికి కారణమని పలువురు చెబుతున్నారు.

సాగు శాతాల్లో...

పంట	సాగైన శాతం
వరి	26
మొక్కజొన్న	82
కొర్ర	60
కంది	78
మినుము	73
వేరుశనగ	53
పత్తి	36
మిరప	54
ఉల్లి	49
మొత్తం	**56**

జిల్లా అయ్యాక నంద్యాల వేగంగా వృద్ధి

- నంద్యాలలో జివి మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లా అయ్యాక నంద్యాల వేగంగా వృద్ధి చెందుతోందని ఎంపి పోచ, ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌లు పేర్కొన్నారు. గురువారం నంద్యాలలో సినీ నటి అనసూయ చేతులు మీదుగా జివి మాల్ అట్టహాసంగా ప్రారంభమైంది. గురువారం నంద్యాలలోని టిటిడి కళ్యాణ మండపం లైన్లో ఏర్పాటు చేసిన జివి మాల్‌ను సినీ, టెలివిజన్ తార అనసూయ భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన గావించగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నీ సా, జివి మాల్ ఎండీ ఉమా మహేశ్వరరావు, మార్కెటింగ్ మేనేజర్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా అయ్యాక అనేక వనరులు వస్తున్నాయన్నారు. జివి మాల్‌ను నంద్యాలలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నంద్యాల అభివృద్ధికి జివి మాల్ దోహదపడుతుందన్నారు. ఈ షాపింగ్ మాల్‌లో స్థానికులకే 300 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం హర్షనీయమన్నారు. నంద్యాల జిల్లా కావడంతో మరిన్ని మాల్స్ ప్రారంభం కావాలని మరెందరికో ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. కర్నూలు కంటే నంద్యాలలో ముందుగా ప్రారంభించినందుకు సంతోషంగా వుందని ఎమ్మెల్యే అన్నారు. మంచి బ్రాండ్స్ వున్న ఇలాంటి మాల్స్ ఎన్నో రావాలని, అందరికీ ఉపాధితో పాటు వ్యాపారాలు జరగాలని కోరుకుంటూ వున్నానన్నారు. పేద,మధ్య తరగతి ప్రజలకు ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ఇక్కడ అన్ని వస్తువులు లభించడం నంద్యాల ప్రజల అదృష్టమని నంద్యాల జిల్లా ప్రజలకు వరమని ఎంపి పోచా బ్రహ్మ నంద రెడ్డి పేర్కొన్నారు. నంద్యాలకు మొదటి సారి రావడం జరిగిందని సినీ నటి అనసూయ భరద్వాజ పేర్కొన్నారు. నవ నందులకు నిలయమైన నంద్యాలలో అడుగు పెట్టడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నంద్యాల ప్రజలు తనకు అపూర్వ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని అనసూయ అన్నారు. జివిమాల్‌లో ఎన్నో రకాలు అందరినీ ఆకట్టుకుంటా యన్నారు. జివి మాల్ ఎండి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో 75 సంవత్సరాల సుధీర్ఘ అనుభవంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో లక్షల మంది హృదయాలను గెలుచుకున్న జివి మాల్ నంద్యాలలో ప్రారంభించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. నంద్యాల ప్రాంత కస్టమర్‌లకు జివి మాల్ అత్యుత్తమ, అంతర్జాతీయ ప్యాషన్ స్టైల్స్ అరుదైన డిజైన్లతో ఇంటిల్లిపాదికి ఆహ్వానం పలుకుతుందని ఉమా మహేశ్వర రావు అన్నారు. జీవి మాల్ నాణ్యతని విస్తారమైన రేంజిని కాంపిటీటివ్ ధరల్ని వాగ్దానం చేస్తుందన్నారు. అద్భుతమైన షాపింగ్ అనుభూతి అందించే షోరూమని పరిమితమైన కలెక్షన్స్ అద్భుతమైన మోడల్స్ అత్యంత అందుబాటు ధరలతో ఫ్యాన్సీ శారీస్, హ్యాండ్లుమ్, హెూం ఫర్ని షింగ్, మొదలగునవే అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో జీవి మాల్లో లభిస్తాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నానని అన్నారు. త్వరలో జివి మాల్స్‌ను కర్నూల్‌లోనూ ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు.



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న అనసూయ భరద్వాజ్

జగనన్న సురక్ష ప్రతి కుటుంబానికీ రక్ష

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



బండి ఆత్మకూర్ : వృద్ధురాలికి కంటి అద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - విలేకరులు

బండి ఆత్మకూర్ : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని భోధనం గ్రామంలో సర్పంచి బారెడ్డి భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం వృద్ధులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేశు వెంకట్రాంరెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ పుల్లారెడ్డి, ఎంపీడీవో వాసుదేవ్ గుప్తా, తాసిల్దార్ రవికుమార్, డాక్టర్ కిరణ్ కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని ఇస్కాల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ హాజరై మాట్లాడారు. అనంతరం రక్త పరీక్షలు, మందులు, ఏర్పాట్లు చేసిన కౌంటర్లను పరిశీలించారు ఐసిడిఎస్ సూపర్వైజర్ లలితా ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు పోషకాహారాన్ని తిని రుచి చూశారు. అనంతరం యూపీ స్కూల్ విద్యార్థులతో జనగణమన ఎన్ని సెకండ్లు పాడాలని అడిగారు. ప్రతి ఒక్కరు మంచిగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలను పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసు, ఎంపీడీవో గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక, ఎంపీపీ సరోజినీ వర్ధినీయ, సర్పంచ్ మౌలాలి, వైద్య అధికారినిలు నాగలక్ష్మి దేవి, గులాబీష, దీపిక, ప్రతాపరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, టీబి సూపర్వైజర్ చెరుకు రవికుమార్, వైసిపి మండల నాయకులు రమణారెడ్డి, మాలిక్ భాష, అంబన్న, బాల ఈశ్వర్ రెడ్డి, భూమా రాములమ్మ, రాజన్న, పాణ్యం నాగిరెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** అందరికీ సంపూర్ణ వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయం అని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. గురువారం తోలమడుగు సచివాలయం నందు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మొలక రాజారెడ్డి, ఉమ్మాయి పల్లె తండా సర్పంచ్ ఎస్ లక్ష్మీదేవి, అబ్దుల్లా పురం సర్పంచ్ మోహన్ లక్ష్మి, ఎస్వి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో జీవీ ప్రసాద్ రెడ్డి, అబ్దుల్లాపూర్ శివారెడ్డి రామనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె**: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీడీవో శివరామయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెండవ సచివా లయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఎంపీడీవో శివరామయ్య ప్రారంభించారు. **మిగతా 6వ పేజీలో...**



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ

టిడిపి మద్దతుదారుల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారు

- జిల్లా కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే బీసీ ఫిర్యాదు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణంలో టిడిపి మద్దదారుల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామున్‌కు బనగానపల్లె నియోజకవర్గంలో పట్టణంలో అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌తో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో 2136 ఓట్లను తొలగించాలని వైసీపీ నాయకులు ఎన్నికల అధికారులకు వినతిపత్రం ఇచ్చి ఓట్లను తొలగిస్తున్నారని తెలిపారు. బతికిన వారు చనిపోయినట్లు, స్థానికంగా ఉన్న వారిని లేరని ఫారం 7లో దరఖాస్తు చేసి వైసిపి కార్యకర్తలు, నాయకులు అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని విమర్శిం చారు. ఒక వ్యక్తి ఏడు ఓట్లను తొలగించడానికి మాత్రమే దరఖాస్తులు ఇవ్వాలని కానీ బనగానపల్లె పట్టణంలో వైసిపి కార్యకర్తలు చెందిన ఎస్. హుస్సేన్ 263 దరఖాస్తులు, రసూల్ 175, కిరణ్ కుమార్ రెడ్డి 109 ,నాగేంద్ర 270 ఇలా వైసిపి నాయకులు ఓట్లను తొలగించాలని 2136 దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. బిఎల్వోలు, వాలంటరీలు కుమ్మక్కై వైసిపి నాయకులు, కార్యకర్తల ద్వారా టిడిపి మద్దతుదారుల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి మద్దతుదారులను ఓట్లను తొలగించి తమకు అనుకూలమైన దొంగోట్లను ఎక్కించుకోవడానికి వైసిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కలెక్టర్, ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న బిఎల్ఓ లను సస్పెండ్ చేయాలని, ఓట్లను తొలగించకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలి


- అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సిఐటియు డిమాండ్

ప్రజాశకి - డోన్

అంగన్వాడీ సెంటర్లలో గర్భిణీలు, బాలిం తలకు అమలు చేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేభారాణి, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం, పట్టణ, మండల అధ్యక్షులు నక్కశ్రీకాంత్, పి.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్వైజర్ అరుణకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1వ తేదీ నుండి గర్భిణీలు, బాలింతలకు టేక్ హెూమ్ రేషన్ అమలు చేస్తుందని, సరుకులు, బాల సంజీవిని, పాలు, గుడ్లు ఇచ్చే సందర్భంలో ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఫోన్లు సక్రమంగా పనిచేయడం లేదని, మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ మండలాలలో నెట్ సిగ్నల్ సక్రమంగా ఉండడం లేదని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు దేవ కృపమ్మ, సుగుణమ్మ, స్టెనో రాజు, ఎస్ఎఫ్ఐ నాయకురాలు ఇర్ఫానా తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్



వైసిపి పాలన నాలుగు సంవత్సరాల ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి ప్రజల పత్రిక : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

ప్రజాశక్తి పత్రిక ప్రజల పత్రిక అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో వైసీపీ నాలుగు సంవత్సరాల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రజాశక్తి దినపత్రిక ఆధ్వర్యంలో ప్రత్యేక సంచికను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక కార్మికులు, రైతులు, ఉద్యోగుల పక్షాన నిలుస్తూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తోందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజల పక్షాన నిలిచిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మడపల్లె సర్పంచ్ వెంకటరామిరెడ్డి, వైసీపీ నాయకులు నూకల వెంకటసుబ్బయ్య, అత్తార్ జాహిద్ హుస్సేన్, సయ్యద్ సజ్జాత్ హుసేన్, కుమ్మరి సురేష్ బాబు, నందివర్గం శ్రీనివాసులు, నంద్యాల డివిజన్ ఇంచార్జి మల్లికార్జున, విలేకర్లు మద్దయ్య, చంద్ర శేఖర్, కొలిమి గుండ్ల సురేష్ లింగాధర్, అవుకు శ్రీనివాసులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి సన్నాహాలు

ప్రజాశక్తీ - శ్రీశైలం

శ్రీశైలంలో ఆది జాంబవ అరుంధతి హిందూ మాదిగ అన్నదాన సత్రం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు సత్రం కమిటీ అధ్యక్షులు జి.సవమ్మ తెలిపారు. హిందూ మాదిగ సత్రానికి శ్రీశైల దేవస్థానం మల్లమ్మ కన్నీరు ఆలయానికి సమీపంలో ఇప్పటికే మంజూరు చేసిన 50 సెంట్ల స్థలాన్ని గురువారం కమిటీ సభ్యుల బృందం పరిశీలించింది. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ స్థలంలో సత్రం నిర్మాణ పనులు, భూమి పూజ విషయమై ఈ నెల 20న సున్నిపెంటలో హిందూ మాదిగలందరి సమక్షంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ తర్వాత సత్రం నిర్మాణ భూమి పూజ పనులు, వసతి గదుల నిర్మాణానికి విరాళాల సేకరణ వంటి కార్యచరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సత్రానికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్‌ను గూగుల్ పే అకౌంట్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. వివరాలకు మీడియా కో ఆర్డినేషన్ సాల్మన్ రాజు 99660 90123, జెసిహెచ్ వెంకట్ 9492693925 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు దర్శనపు శ్రీనివాస్, కార్యదర్శి వై. అంకయ్య, ట్రెజరర్ కాశయ్య, సభ్యులు పాల్గొన్నారు.




స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యుల బృందం

అవినీతి రారాజు ముఖ్యమంత్రి జగన్ : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడిన అవినీతి రారాజు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి విమర్శించారు. గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయ సమీపంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి కమ్మ సంఘం నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. 'బాబుతో నేను బాబు గారికి తోడుగా ఒక నియంత పై పోరాటం కోసం మేము సైతం' అంటూ టిడిపి కమ్మ (చౌదరి) కులస్థుల ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష నిర్వహించారు. రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కమ్మ సంఘం నాయకులకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనకు చమర గీతం పాడాలన్నారు. వైసీపీ నియంతృత్వ పాలనలో అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను అవినీతి పరుడిగా పేరుఉందని అందరికీ ఆ మరకలు అందించేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. త్వరలో ఆణిముత్యంలో చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని తెలిపారు. కార్యకర్తలు నాయకులు చంద్రబాబు బయటికి వచ్చేంతవరకు అల్పెరగని పోరాటం చేయాలన్నారు. అనంతరం దీక్షలో కూర్చున్న నాయకులకు టిడిపి నియోజకవర్గ నాయకులు బిసి రామనాథరెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కమ్మ సంఘం నాయకులు

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణలో భాగంగా 51పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పుకు, 17 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు భారత ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు సమర్పించామని జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 13 పోలింగ్ స్టేషన్లు, శ్రీశైలంలో 4, నందికొట్కూరులో 2, నంద్యాలలో 7, బనగానపల్లెలో 7, డోన్ నియోజకవర్గంలో 18 పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే శ్రీశైలంలో ఒకటి, నందికొట్కూరులో 6, నంద్యాలలో 10 కొత్త పోలింగ్ స్టేషనులకూ ప్రతిపాదనలు పంపామన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. జిల్లాస్థాయిలో ప్రతి బుధవారం, నియోజకవర్గ స్థాయిలో ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలింగ్ స్టేషన్ల హేతు బద్ధీకరణ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లి వారు సూచించిన సలహాలు, ఆక్షేపణలను పరిగణలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేసి భారత ఎన్నికల కమిషన్ కార్యాలయానికి సమర్పించామని డిఆర్ఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

21న పూర్వ విద్యార్థుల సమ్మేళనం : చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జరగబోయే పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరగనుంది. గురువారం విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో గత 25 ఏళ్లుగా ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరరు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.సునీత, సిపిడిసి మెంబర్ సర్వోత్తమ రెడ్డి, శ్రీ నంది జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బద్దుల శ్రీకాంత్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ అవార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజాసేవలో రాణిస్తున్న ప్రఖ్యాత ఎన్జీవో సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ అవార్డుల ప్రదానం కొరకు దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా రెవెన్యూ అధికారి బి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరంలో వైఎస్ఆర్ అవార్డ్స్ కొరకు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, మహిళలు, వృద్ధులు, పిల్లల అభ్యున్నతికి 10 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ కాలం పాటు ఆదర్శప్రాయమైన సేవలు అందిస్తున్న ప్రఖ్యాత ఎన్జీవో సంస్థలు ఈనెల 10వ తేదీలోగా సంబంధిత మండల తాసిల్దారుల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని డిఆర్ఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

టిడిపి వృద్ధ కార్యకర్తపై దాడి దారుణం

- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

టిడిపి అధినేతకు మద్దతుగా, భువనేశ్వరికి సంఘీభావంగా శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న చిన్నదేవళాపురం గ్రామం వృద్ధ కార్యకర్త నారాయణను వినుకొండ నియోజకవర్గం, వితంరాజుపల్లి వద్ద అడ్డుకుని ముఖంపై పైశాచికంగా దాడి చేశారని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అరాచకాలకు, అవినీతికి వ్యతిరేకంగా నోరు తెరిస్తే అక్రమ కేసులు, అరెస్ట్‌లు, నడిస్తే దాడులు చేస్తున్నారని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యంగా మారిందన్నారు. వైసీపీ మూకలకు చట్టం చుట్టంగా, పోలీసులు సేవకులుగా మారారని అన్నారు. పోలీసులకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా నారాయణపై దాడికి తెగబడిన వైసీపీ మూకలను వెంటనే అరెస్ట్ చేయాలని, హత్యా ప్రయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి డేవిడ్

ఉపాధి పనులు చేపట్టాలి : వ్యకాసం

ప్రజాశకి - బండి ఆత్మకూర్

మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి పనులను ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి డేవిడ్ డిమాండ్ చేశారు. గురువారం బండి ఆత్మకూరులో వ్యకాసం మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని తెలిపారు. ఈ వలసలను వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సిఐటియు నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసినప్పుడే అవార్డులు : ఎంఇఒలు

ప్రజాశక్తి - పగిడ్యాల

నిబద్ధత, అంకితభావంతో పని చేసినప్పుడే అవార్డులు వరిస్తాయని ఎంఈఓలు సుభాన్, మురళి మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డు అందుకున్న మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామం ఎంపీపీ పాఠశాల ఎలిషమ్మను గురువారం మండల స్థాయి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు మాట్లాడారు. వృత్తి పట్ల ఆసక్తి కనపర్చినప్పుడే ఆ వృత్తిలో నైపుణ్యాన్ని ప్రదర్శించవచ్చున్నారు. వృత్తిపరంగా ఎన్ని అడ్డంకులు వచ్చినా, వాటి తట్టుకొని నిలబడినప్పుడే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న ఎలిషమ్మను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులు ఎలిషమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


దగ్ధమైన కొట్టం

కొట్టం దగ్ధం

- రూ 50 వేలు నష్టం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని పాత ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి కొట్టం దగ్ధమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పాత ఎస్సీ కాలనీకి చెందిన రాజమ్మకు చెందిన కొట్టం ప్రమా దవశాత్తూ అగ్నిప్రమాదానికి గురైంది. ప్రమాదవశాత్తు మంటలు చెలరే గాయి. క్షణాల్లో మంటలు వేగంగా వ్యాపించి కొట్టం దగ్ధమైంది. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని వంట సామాగ్రి,నిత్యవసర వస్తువులు,తదితర వస్తుసామాగ్రి దగ్ధమై సుమారు రూ.50 వేల మేర ఆస్థి నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న ఆళ్ళగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.




ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కెజిబివిలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలో తెలుగు పేట ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. ప్రతాప్, కస్బా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. సుంకన్నల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎంఇఒ స్వరూప మాట్లాడుతూ ఏ విద్యార్థి అయితే ఉపాధ్యాయుడు ఇచ్చిన అభ్యసన కృత్యాలను నెరవేరుస్తూ ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుతారో అప్పుడే ఉపాధ్యాయుడు చెప్పిన చదువుకు సార్థకత లభిస్తుందని అన్నారు. మండల విద్యాశాఖ అధికారిణి పి .స్వరూప ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. తెలుగు పేట ఉపాధ్యాయులు, కస్బా పాఠశాల ఉపాధ్యాయులు ఎంఇఒ స్వరూపను సన్మానించారు.


శీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని డి.వనిపెంట గ్రామంలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు గురువారం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఐదుగురు గర్భిణులకు జడ్పిటీసి లక్ష్మిదేవి, తహసీల్దారు సుభద్రమ్మ,వైద్యాధికారులు రాధికజ్యోతి,అంజలి, ఎంఈఓ అనురాధలు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భణీలు అంగన్ వాడీ కేంద్రాలు అందించే పౌష్టిక ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఎంపీడీవో మహబూబ్ దౌలా,ఈఓఆర్డి సుదర్శన్ రావు,వైద్యులు చంద్రశేఖర్ రెడ్డి,శివమోహన్,హెల్త్ఎడ్యుకేటర్ రత్నాలు, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్,ఆంగన్‌వాడీ కార్యకర్తలు,ఆరోగ్య,వైద్య,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి : సిఐ


ఆటో డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ నాగభూషణం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆటో డ్రైవర్లు నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆత్మకూరు సిఐ నాగభూషణం అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ఆటోల్లో సౌండ్ బాక్స్ పెట్టుకోకూడదని, ప్రతి ఒక్కరు యూనిఫామ్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, ఓవర్ లోడ్ వేయకూడదని తెలిపారు. ఓవర్ లోడ్ వేసినట్లయితే యాక్సిడెంట్ జరిగితే ఇన్సూరెన్స్ రాదని, అతివేగంగా వెళ్ళకూడదని అన్నారు. ఆటోలో ప్రయాణికులు వస్తువులు మరిచిపోతే వారికి చేర్చాలన్నారు. సమావేశంలో ఎస్సైలు కృష్ణమూర్తి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని డి.వనిపెంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దారు సుభద్రమ్మ, ఎంఈఓ అనురాధలు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి,సిఆర్‌పి ఖాసీం పాల్గొన్నారు.

చింత సురేష్‌ను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కర్నూలు జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ చింత సురేష్ బాబును జనసేన అళ్లగడ్డ నియోజకవర్గ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో గల సమస్యలపై అలాగే మండల, నియోజకవర్గ ఇంచార్జిల నియామకం వంటి వాటిపై పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకొని వెళ్ళవలసిందిగా కోరడం జరిగిందన్నారు. జనసేన, టిడిపి పొత్తులో భాగంగా టిడిపి తో కలిసి ముందుకు సాగాలని, జనసేన పార్టీ బలోపేతంపై చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాబుహుస్సేన్, బావికాడి గుర్రప్ప, దూదేకుల బాబు, డేవిడ్, మైలేరు శ్రీరాములు, సజ్జల నాగేంద్ర, చలివెందుల రాజారామ్, బుడ్డశెట్టి అంజి, వరద జగదీష్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి : కెవిపిఎస్


వినతి పత్రం ఇస్తున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు కే. రంగమ్మ

ప్రజాశక్తి - గడివేముల

దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి, రక్షణ కల్పించాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు కే రంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గడివేములలోని పాత బస్టాండ్ సమీపంలో కెవిపిఎస్ జెండాను ఆమె ఎగరవేశారు. అనంతరం డప్పు వాయిస్తూ ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని 41 సిఆర్‌పిసి ప్రకారం ఇవ్వడాన్ని వ్యతిరేకించాలని, ఎస్సీ ఎస్టీల పై దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాలు, కేసులను విచారించడానికి జిల్లాలో ఫ్లాష్ ట్యాగ్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను పగడ్బందీగా అమలు చేయాన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మార్నింగ్ టర్నింగ్ కమిషన్ను ఏర్పాటు చేసి సంఘాలకు కమిటీలలో ప్రాతినిధ్యం కల్పించాలని తెలిపారు. అన్ని సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దళిత డప్పు కళాకారులకు 45 సంవత్సరాలకే పెన్షన్ ఇచ్చి వారికి చర్మకారులకు పెన్షన్ 5000 పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం, రెండు ఎకరాల సాగు భూమి కేటాయించాలని, గృహ నిర్మాణానికి రుణాలు ఐదు లక్షలకు పెంచాలని, దళిత గిరిజనులకు ఇస్తున్న 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును 300 యూనిట్లకు పెంచాలన్నారు. గడివేముల మండలంలోని అన్ని గ్రామాల డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులుకు, ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారి చంద్రశేఖర్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం నాయకులు జి.వెంకటసుబ్బయ్య, వై.యేసురత్నం, జి. వెంకటరమణ, వై.సామన్న, వై.దానలింగం, చిన్న సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రతి కుటుంబానికీ రక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

(5వ పేజీ తరువాయి...)

టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శివరామయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేటు వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఈవో ఖలీల్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి** : ప్రజలందరినీ ఆరోగ్యంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష ఉద్దేశం అని సర్పంచ్ రేనాటి బాలీశ్వరరెడ్డి, ఎంపిపి వీరభద్రుడు, జడ్పిటిసి సభ్యురాలు లక్ష్మీదేవి, మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని డి వనిపెంట గ్రామంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంను వారు ప్రారంభించారు. తహశీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, మండల విస్తరణ అధికారి సుదర్శన్ రావులపర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రజలకు ప్రత్యేక వైద్యాధికారులు స్త్రీ వ్యాధినిపుణురాలు డాక్టర్ రాధిక జ్యోతి, ఈఎన్‌టి చంద్రశేఖర్ రెడ్డి,స్థానిక వైద్యులు అంజలి, శివప్రసాద్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్,ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ, హెల్త్ఎడ్యుకేటర్ రత్నాలు,ఎంపిహెచ్ఓలు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ బాలస్వామీ, వైద్య,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల:** ప్రజా ఆరోగ్య కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. బేతంచర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామం సచివాలయం రెండులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాగరిక, డాక్టర్ శ్రీకాంత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ తిప్పమ్మ, వైయస్ఆర్పి నాయకులు వైయస్సార్ పి మండల కన్వీనర్ కుంచె తిరుమలేశ్వర్ రెడ్డి, గూనీ నాగరాజు, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, యాకోబు, ఎద్దుల అన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** జగనన్న ఆరోగ్య సురక్ష నంద్యాల మండల పరిధిలోని పెద్ద కొట్టాల గ్రామంలోని గ్రామ సర్పంచ్ రాముడు, ఎంపిడిఒ సుగుణ శ్రీ, విస్తరణ అధికారి మహీధర్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి భార్గవి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా డ్వామా పిడి రామచంద్ర రెడ్డి, డిఎంహెచ్ ఒ వెంకట రమణ పాల్గొని క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భ ంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి డిఎంహెచ్ఒ వివరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ అశ్రఫ్ వలి, డాక్టర్ ఉదయ సంధ్య, ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు. **అవుకు:** మండలంలోని మంగంపేట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఉప్పలపాడు ప్రాథమిక వైద్యులు డాక్టర్ టి వినోద్ కుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. **గడివేముల:** కోర్రపోలూర్ గ్రామంలో సర్ప ంచ్ మాలిక్ బాషా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహి ంచారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. అంగ న్వాడి సూపర్వైజర్లు ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార స్టాలను ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, సర్పంచ్ మాలిక్ బాషా పరిశీలించారు. అంగన్వాడి సూపర్వైజర్లు కళా వతి, విజయ లక్ష్మి పాల్గొన్నారు. **రుద్రవరం:** ఎంపీడీవో మధుసూదనరెడ్డి, తహాశీల్దార్ రవీంద్ర ప్రసాద్‌ఘ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు.


కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలములోని ఆర్ఎస్ రంగాపురం గ్రామము వద్ద కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ జి బి మలింగ గురువారం అరెస్టు చేశారు. ముల్లగుర్తి మధుభూపాలుడు అను వ్యక్తిని అరెస్ట్ చేసి విచారించగా డోన్ పట్టణమునకు చెందిన దూదేకుల దస్తగిరి, దూదేకుల షేక్షా వలి మద్యం సరఫరా చేస్తారని తెలపడంతో ముగ్గురి వ్యక్తుల మీద కేసు రిజిస్టర్ చేసి, పట్టుబడిన ముద్దాయిని జేఎఫ్ ఎంసి డోన్ వారు ముందర హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు జి బి మలింగ తెలిపారు.


నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

ఇబ్బంది కలిగించే కరెంట్ పోల్స్‌ను తొలగించాలి

ప్రజాశక్తి-డోన్

ప్రజలకు ఇబ్బంది ఉన్న కరెంట్ పోల్స్‌ను తొలగించాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదేశించారు. గురువారం డోన్ పట్టణం లోని పాతపేట నందు రైల్వే డబల్ లైన్ పనులు జరుగుతున్నదున రోడ్డుకి అడ్డంగా కరెంటు పోలు నాటినందున పాతబుగ్గ, మాలిక్ బాబా దేవాల యాలు ఉన్నందున ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ రైల్వే అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా కరెంట్ పోల్స్‌ను తొలగించాలని అన్నారు. అలాగే లెప్రసీ కాలనీ వాసులు రోడ్డు సౌకర్యం కావాలని తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,ఏఈ సురేష్, రైల్వే ఏఈ, విద్యుత్ శాఖ,పుర ప్రముఖులు బైసాని రాజు,దినేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో జరిగిన గణేష్ నిమజ్జన వేడుకల్లో వకులా నదిలో పడి మృతి చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే యువకుడి కుటుంబాన్ని ఆళ్లగడ్డ గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆర్థికంగా ఆదుకుంది. ఈ మేరకు గురువారం ఆవుల భాస్కర్ రెడ్డి సేవా సమితిలో జరిగిన కార్యక్రమంలో మృతుని తల్లిదం డ్రులైన నరసింహారెడ్డి, లీలావతి దంపతులకు గౌరవ అధ్యక్షులు, పారిశ్రామి కవేత్త టీఎంసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రూ. లక్ష నగదు ఆర్థిక సాయం అందించారు. మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నీలకంఠేశ్వరం, ప్రజ్ఞా విద్యా సంస్థల అధినేత ప్రజ్ఞ నరసింహారెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, గ్యాస్ పుల్లయ్య, సోముల శ్రీనివాసరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

భారత జట్టు ప్రపంచ కప్ గెలవాలి : సిఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

భారత జట్టు ప్రపంచ కప్ గెలవాలని, విజయ పరంపర కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ బాబు అన్నారు. గురువారం ఆర్ఆర్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం, సోముల హరిప్రసాద్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ రమేష్ బాబు పాల్గొని కేకు కట్ చేసి భారత్ టీంకు బెస్ట్ ఆఫ్ తెలియజేశారు. అనంతరం సిఐ రమేష్ బాబు మాట్లాడుతూ స్వదేశంలో గురువారం నుంచి క్రికెట్ వరల్డ్ కప్ ప్రారంభమ వుతుండడంతో భారత జట్టు ఫైనల్ చేరుకొని వరల్డ్ కప్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ అకాడమీ కోచ్ సుబ్బరాయుడు, డాక్టర్ రామ్ గోపాల్ రెడ్డి, ఇన్నర్ వీల్ మాజీ అధ్యక్షులు కృష్ణవేణి ప్రియ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు హరీష్ బాబు, శబరిష్ సత్యం, పిఈటి ప్రభాకర్, అమీర్ బాష పాల్గొన్నారు.


విజయ సంకేతం చూపిస్తున్న సిఐ రమేష్ బాబు

జనసేన ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ

ప్రజాశక్తి - బేతంచర్ల

మండల పరిధిలోని బుగ్గాన పల్లి తండా నివాసి ఎం విజయ్‌కి జనసేన పార్టీ ఆధ్వర్యంలో రూ.2000 పెన్షన్‌ను పంపిణీ చేశారు. పెన్షన్ దారుడు గత రెండున్నర సంవత్సరాలుగా పక్షపాతంతో బాధపడుతు విజయ్ ప్రభుత్వ పెన్షన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి సంబంధిత అధికారులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో జనసేన పార్టీ మండల కన్వీనర్ చల్లా మద్దిలేటిని సంప్రదించగా స్పందించిన చెల్లా మద్దిలేటి బాధితుడు ఎం విజయకి గత రెండు నెలలుగా ప్రభుత్వ పెన్షన్ వచ్చేవరకు జనసేన ఆధ్వర్యంలో పెన్షన్లును గురువారం ఇంటికి వెళ్లి ఇచ్చారు. బాధితుడు ఎం విజయ్ జనసేన పార్టీ కన్వీనర్ చల్లా మద్దిలేటికి, జనసేన పార్టీ మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కోసం మేము సైతం అంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉప అధ్యక్షుడు ఎంఎస్ అన్సర్ బాష కార్యకర్తలతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదుట మెయిన్ బజార్లో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎస్ అన్సర్ బాష మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపారని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎన్నో మరుపురాని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తి నరసింహుడు, వార్డు సభ్యులు మౌలాలి హనీఫ్,ముల్లా అజీమ్, ఖాజా రసూల్, రమేష్, వేణుగోపాల్ రెడ్డి, సుబ్బారావు శెట్టి, హుస్సేన్ పీరా, వలి, మాబులాల్, బషీర్,ఇర్షాద్, టైలర్ బాష, నూర్ బాషా, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరిస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్ళీ జగనే కావాలి మళ్లీ జగనే రావాలి' కార్యక్ర మంలో భాగంగా సచివాలయ కన్వీన ర్లకు, గహ సారథులకు, వాలంటరీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, వాలంటరీలు ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో బనగానపల్లె నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలిపారని, ఈసారి మళ్లీ జగన్ కావాలి మళ్లీ జగన్ రావాలి కార్యక్రమాన్నీ ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకువెళ్లి రాష్ట్రంలో బనగానపల్లె నియోజకవర్గం వర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలన్నారు. నియోజకవర్గం లో బనగానపల్లె పట్టణం లో డబల్ రోడ్లు, సెంట్రల్ లైట్లు, 100 పడకల ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం, నూతన ఎంపీడీవో కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం, సచివాలయాల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. పట్టణంలో 3,000 మంది పేదలకు ఇంటి స్థలాలు ఇస్తుంటే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి కోర్టుకు వెళ్లే అడ్డుకున్నారని విమర్శించారు. టిడిపి నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి సంక్షేమం జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని తిరిగి అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసీపీ యువజన విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వరరెడ్డి ,జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సన్నాల జనార్దన్ రెడ్డి ,ఎంపీపీ మానసవీణ ,జడ్పిటిసి సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ ,మార్కెట్ యార్డ్ చైర్మన్ దీవెనమ్మ ,మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వైసీపీ రైతు విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు జిల్లెల్ల శివరామిరెడ్డి, నాయకులు డాక్టర్ మమ్మద్ హుస్సేన్, అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహిద్ హుస్సేన్, కోడూరు రామచంద్రారెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం డిఎస్పి ఏ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. పట్టణంలోని క్రైమ్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. పట్టణంలో నానాటికి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సారా విక్రయాలను అరికట్టాలని, కేసుల సంబంధించిన రికార్డులను అప్డేట్‌లో ఉంచుకోవాలని, పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రజలకు మంచిగా మాట్లాడి సత్వర న్యాయం చేయాలని పలు సూచనలు చేశారు.

నేడు సంజామలకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - సంజామల

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శుక్రవారం సంజామలకు వస్తున్నట్లు కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్య ప్రకాష్ రెడ్డి గురువారం తెలిపారు. జగన్ కావాలి జగన్ రావాలి జగన్ మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి ఎమ్మెల్యే వస్తున్నట్లు ఆయన తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.